E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :109 శనివారం 19 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## "దుకాణం ధర ఒకటి.. బెల్ట్ షాపులో బాదుడు మరొకటి

# చివరికి గుడుంబానే గతి!"

**కన్నాయిగూడెం ఏజెన్సీలో మద్యం ధరల దందాపై తక్షణ చర్యలు తీసుకోవాలి**

**అధిక ధరలతో గుడుంబా వైపు మళ్లుతున్న మద్యం వినియోగదారులు**

**-- తుడుం దెబ్బ కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఆలం రాంబాబు డిమాండ్**




**తెలుగు గళం కన్నాయిగూడెం, సెప్టెంబర్ 18:**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల ఏజెన్సీ ప్రాంతంలో మద్యం విక్రయాలపై వస్తున్న అధిక ధరల వసూళ్ల ఆరోపణలు, బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయాలు, అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఆలం రాంబాబు డిమాండ్ చేశారు. వైన్స్ షాపుల్లో మద్యం సీసాలపై ఉన్న ఎంఆర్‌పీ కంటే సుమారు రూ. 20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, బెల్ట్ షాపులకు మద్యం తరలించి అక్కడ రూ. 20 నుంచి రూ. 50 వరకు అదనపు ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రోజంతా కష్టపడి పనిచేసే కార్మికులు, పేదలు సాయంత్రం మద్యం కోసం వెళ్లినప్పుడు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుండటంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం పడుతోందన్నారు.



**అధిక ధరలతో గుడుంబా వైపు మళ్లే ప్రమాదం**

వైన్స్ షాపుల్లోనే అధిక ధరలు చెల్లించాల్సి రావడంతో కొంతమంది మద్యం వినియోగదారులు "తక్కువ రేటు.. ఎక్కువ మైలేజ్"అనే భావనతో నాటుసారా, గుడుంబా వైపు మళ్లుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆలం రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. గుడుంబా తక్కువ ధరకు లభిస్తుందనే కారణంతో దాని వైపు ఆకర్షితులైతే ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఈ వ్యసనానికి గురికాకుండా గుడుంబా తయారీ, విక్రయాలపై కూడా ఎక్సైజ్ అధికారులు కఠిన నిఘా పెట్టాలని కోరారు.



**అధికారులు వెంటనే రంగంలోకి దిగాలి**

కన్నాయిగూడెం మండలంలోని వైన్స్ షాపులు, బెల్ట్ షాపులు, అనధికారిక మద్యం విక్రయ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు, ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆలం రాంబాబు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నట్లు తేలితే సంబంధిత దుకాణాలపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా, అనధికారిక విక్రయాలు, గుడుంబా తయారీ--విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్వయంగా జోక్యం చేసుకుని కన్నాయిగూడెం ఏజెన్సీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆలం రాంబాబు కోరారు. ఎంఆర్‌పీ ఉల్లంఘనలకు అడ్డుకట్ట, బెల్ట్ షాపుల నియంత్రణ, గుడుంబా నిర్మూలన, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టి ఏజెన్సీ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీమ పౌరుషం చూపిస్తా!

- కొత్త పార్టీతో సీమ రాజకీయాల్లో వేడి
- సీమ పౌరుషం చూపిస్తామన్న విజయసాయి
- రెడ్ల ఆత్మగౌరవమే పార్టీ లక్ష్యం
- రెడ్డి కార్పొరేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నేత
- సీమ అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ విమర్శలు
- రాయలసీమ నుంచి వలసలపై ఆవేదన
- యువత అభివృద్ధి కోసం పనిచేయాలి
- సీమను 'రతనాల సీమ'గా మారుస్తాం



2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్రంలో త్వరలో స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీ రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా నిలుస్తుందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడే పార్టీగా పనిచేస్తుందని, అసలైన సీమ పౌరుషం ఎలా ఉంటుందో రాబోయే రోజుల్లో చూపిస్తామని స్పష్టం చేశారు.

**రెడ్డి కార్పొరేషన్ ఏదీ?**

రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులకు పూర్తి న్యాయం చేస్తూనే రెడ్ల ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యతను తమ పార్టీ తీసుకుంటుందని తెలిపారు.

# 'కల్పిత నాయకుడు' పుస్తకానికి చెక్!


2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** డాక్టర్ బీఆర్ అంబేదర్‌పై అనుచిత వ్యాఖ్యలతో 'కల్పిత నాయకుడు' (ఫ్యాబ్రికేటెడ్ లీడర్) పుస్తక రచయిత వరప్రసాద్ అలియాస్ హమారాప్రసాద్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినందున పుస్తకావిష్కరణ జరిగే ప్రసక్తే లేదని ప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది.

# ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

- టెంపోలోనే సామూహిక అత్యాచారం
- కత్తితో పొడిచి హత్య
- పొలంలో మృతదేహం పడేసిన నిందితులు
- 50కి పైగా సీసీటీవీల పరిశీలన
- ఐదు రోజులు టెంపో కదలికల ట్రాకింగ్
- ముగ్గురు మైనర్లతో నలుగురు అరెస్ట్
- కత్తులు, దుస్తులు, టెంపో స్వాధీనం


2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున నిర్భయ తరహా దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పదహారేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పడేసిన ఘటన కలకలం రేపుతోంది. ఈ దారుణానికి సంబంధించిన కుళ్లిపోయిన మృతదేహం సెప్టెంబర్ 13న లభించగా.. పోలీసులు దర్యాప్తు చేసి నలుగురు నిందితులను నేడు అదుపులోకి తీసుకున్నారు.

టెంపోలో గ్యాంగ్‌రేప్.. సైలెంట్‌గా మర్డర్

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బాలికకు, నిందితులకు ముందుగానే పరిచయం ఉంది. ఘటన జరిగిన రోజు ఆమె వారితో కలిసి టెంపోలో ప్రయాణించింది.

# డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!


2 లో

- అనుమతులపై పోలీసులకు కీలక విజ్ఞప్తి
- హోంమంత్రి, డీజీపీకి లోకేష్ ట్యాగ్
- అనుమతుల ప్రక్రియ సులభతరం చేయాలి
- వేగంగా క్లియరెన్స్‌లు ఇవ్వాలని సూచన
- డీజే వాహనాలు సీజ్ చేయొద్దని విజ్ఞప్తి
- నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- పోలీసులకు అనిత కీలక ఆదేశాలు

# నిషేధిత భూములకు సర్కార్ చెక్!



2 లో

- 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీ
- ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌కు కీలక బాధ్యత
- సభ్యులుగా లా సెక్రటరీ, స్టాంప్స్ ఐజీ నియామకం
- నిషేధిత జాబితాపై ప్రజల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కార మార్గాలపై కసరత్తు
- భూ యజమానుల సమస్యలకు త్వరిత పరిష్కారంపై ఫోకస్

## రూ.14 వేల లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన గోవిందరావుపేట తహసీల్దార్!

**భూమి పొతి మార్పిడి కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

**ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ.. ముందస్తు ప్రణాళికతో పట్టివేత**

**తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ సోదాలు**

**తెలుగు గళం, ములుగు, సెప్టెంబర్ 18:**



2 లో

ములుగు జిల్లా గోవిందరావుపేట మండల తహసీల్దార్ సృజన్‌కుమార్ రూ.14 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. భూమి పొతి మార్పిడి ప్రక్రియకు సంబంధించి లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుదారుడి నుంచి నగదు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు, తనిఖీలు నిర్వహిస్తున్నారు. లంచం వ్యవహారానికి సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

- దానం నాగేందర్‌పై హైకోర్టు కీలక తీర్పు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- 2024 ఏప్రిల్ నుంచే అనర్హత వర్తిస్తుందని స్పష్టం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి దానం
- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీ-ఫారమ్‌పై పోటీ
- అనర్హత కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేసిన పిటిషనర్లు

2 లో

# 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

- ఫార్ములా ఈ కేసుపై కేటీఆర్ ఫైర్
- రూ.1000 కోట్లకు ఆస్తుల ఆఫర్
- లక్ష కోట్ల ఆరోపణలపై కౌంటర్
- తప్పుడు కేసులు పెడుతున్నారన్న కేటీఆర్
- న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం
- ఎప్పుడైనా విచారణకు సిద్ధమని స్పష్టం
- బ్రాండ్ ఇమేజ్ కోసమే రేస్ నిర్వహణ
- కాంగ్రెస్ తీరుపై కేటీఆర్ విమర్శలు



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు ఫార్ములా ఈ రేస్ నిర్వహించామని, అందులో అవినీతి జరిగిందని తప్పుడు కేసులు పెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ కారు రేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసులకు భయపడము.. న్యాయవ్యవస్థలపై తమకు అపారమైన నమ్మకం ఉందన్నారు. పోలీసులు ఎంత వేధించిన ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు

2 లో

# హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!

- మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు
- 9 మంది నిందితులకు జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం
- శిక్ష పడిన వారిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు
- ఉద్యోగాల ఆశ చూపి మహిళలను అక్రమంగా తరలింపు
- బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఏ దర్యాప్తు
- 12 మంది నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ
- సాక్ష్యాధారాల పరిశీలన తర్వాత నేరం రుజువు

2 లో

# జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!

- జీవో 118 బాధితులకు ప్రభుత్వం భారీ ఊరట
- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు
- ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి క్రమబద్ధీకరణ
- 1000 చదరపు గజాల లోపు స్థలాలకు అవకాశం
- చదరపు గజానికి రూ.250 రుసుముతో క్రమబద్ధీకరణ
- ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ప్రక్రియకు కదలిక
- లబ్ధిదారులకు త్వరలో హక్కు పత్రాల జారీ

2 లో

## సీమ పౌరుషం చూపిస్తా!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఇన్ని ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతానికి చెందిన నేతలే అయినప్పటికీ, సీమను ఏమాత్రం అభివృద్ధి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాలు రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలిస్తున్నప్పటికీ రాయలసీమకు జరిగింది శూన్యమని మండిపడ్డారు. ఈ రెండు కుటుంబాలు కలిసి సీమలోని ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయాయని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఈ కుటుంబాలకు రాజకీయాలు గుర్తుకొస్తాయని, సీమలో పుట్టిన ఈ నాయకులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడి ఈ ప్రాంతాన్ని విస్మరించారని ఆరోపించారు.

రాయలసీమను 'రతనాల సీమ' చేస్తాం..

రాష్ట్రంలో అత్యధికంగా ప్రజలు వలస వెళ్తున్నది రాయలసీమ నుంచే కావడం చాలా బాధాకరమైన విషయమని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ యువత ఇకనైనా వ్యక్తుల కోసం కాకుండా ఈ గడ్డ అభివృద్ధి కోసం, రాష్ట్ర దేశాభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ పార్టీల వల్ల రాయలసీమ ఎప్పటికీ బాగుపడదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతను భాగస్వామ్యం చేస్తూ రాయలసీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీ అన్ని కులాలను, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## దానం నాగేందర్‌పై అనర్హత వేటు!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఆయనపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. దానం నాగేందర్ విషయంలో అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మసనం, స్పీకర్ ఉత్తర్వులపై స్టే విధించింది. ఈ తీర్పుతో 2024 ఏప్రిల్ నుంచే ఆయన శాసనసభ్యుడిగా అనర్హతకు గురైనట్లు కోర్టు స్పష్టం చేసింది.


బీఆర్ఎస్ నుంచి గెలుపు..

2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అయితే, బీఆర్ఎస్‌కు అధికారికంగా రాజీనామా చేయకుండానే 2024 లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ బీ-ఫారమ్ పోటీ చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మరొక పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శలు వచ్చాయి.

స్పీకర్‌కు ఫిర్యాదు..

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, విచారణ చేపట్టిన స్పీకర్.. దానం నాగేందర్ చట్టబద్ధంగా పార్టీ మారినట్లు ఆధారాలు లేవంటూ ఆ పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం స్పీకర్ నిర్ణయం చెల్లదని తేల్చిచెప్పిన హైకోర్టు, దానం నాగేందర్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసింది.

## జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!



GOVERNMENT OF TELANGANA
REVENUE (LAND ADMINISTRATION. I) DEPARTMENT

Memo. No. 46940/Land Admin. I(1)/2026-3 Dated: -09-2026

Sub: Lands - G. O. Ms. No. 118 (L. B. Nagar Constituency) – Short discussion on "Issues related to Section 22 – A of Registration Act" in the Telangana Legislative Assembly on 16-09-2026 – Instructions – Issued.

Ref's: 1) G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022.
2) G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023.

<<>> <<<>>> <<>>

The attention of the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad and District Collector Ranga Reddy and Medchal Malkajgiri is invited to the references cited and they are requested to dispose all 9792 applications received under G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022 read with G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023 within a period of One Month subject to Hon'ble Court Orders, if any.

LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

To
The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad.
The District Collector Ranga Reddy and Medchal Malkajgiri.
SC

//forwarded by order //

Asst. Secretary to Govt.,

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రభుత్వం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీవో 118 భూముల సమస్యకు పరిష్కారం చూపింది. గత 15, 20 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించింది. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను త్వరలోనే పరిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను కూడా విడుదల చేసింది.

జీవో 118 నేపథ్యం ఇదే..

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కార్వాన్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మేడ్చల్ తదితర నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని దీర్ఘకాలంగా ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజల స్థలాలను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో గతంలో ఈ జీవో 118ని తీసుకువచ్చారు. ఈ విధానం కింద 1000 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలను నిర్ణీత రుసుముతో క్రమబద్ధీకరించే అవకాశం కల్పించారు. చదరపు గజానికి రూ.250 చొప్పున రుసుము చెల్లించేలా నిబంధన రూపొందించారు. అయితే, ఎన్నికల కోడ్, ఇతర టెక్నికల్ కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారులకు సకాలంలో హక్కు పత్రాలు ఇంకా అందలేదు. ఫలితంగా జీవో 118 అమలులో జాప్యం జరిగి సమస్య కొనసాగింది. ఈ నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, లబ్ధిదారులకు హక్కు పత్రాలు జారీ చేసే ప్రక్రియపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

## నిషేధిత భూములకు సర్కార్ చెక్!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన చేయగా, ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. భూముల జాబితాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విజ్ఞప్తులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపడానికి ప్రభుత్వం ఓ హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ముగ్గురు అధికారులతో కూడిన ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్..

ఈ ఉన్నత స్థాయి కమిటీకి చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ ను ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవహరించనున్నారు. ఈ కమిటీ నిషేధిత భూముల జాబితాలోని అంశాలపై సమగ్రంగా చర్చించి, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు తగిన కార్యాచరణను రూపొందించనుంది. సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా భూ యజమానుల సంవత్సరాల తరబడి ఉన్న సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

## ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

మొదటి పేజీ తరువాయి

ప్రయాణ సమయంలో వారు టెంపోలోనే కలిసి మద్యం సేవించారు. ఆ తర్వాత బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా నార్త్‌వెస్ట్ ఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో, కుషాక్ రోడ్డు సమీపంలోని జైపాల్ రాణా అనే వ్యక్తి పొలంలో పడేశారు. సెప్టెంబర్ 13న ఈ కుళ్లిన మృతదేహం స్థానికులకు కంటపడింది. అయితే, మృతదేహం కనీసం లింగ నిర్ధారణ చేయడానికి కూడా వీలుకాని స్థితిలో ఉంది. కొన్ని భాగాలను వీధి కుక్కలు తినేయగా, ఒక చేయి వేరుపడి కనిపించింది. బాలిక తరచూ ఇంటి నుంచి వెళ్లి కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండటంతో, కుటుంబ సభ్యులు ఆమె కనిపించట్లేదని ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

50కి పైగా సీసీటీవీ ఫుటేజ్‌ల పరిశీలన..

ఈ ఘటనపై పోలీసులు బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడం, నిందితుల గుర్తింపు మొదట స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు ప్రత్యేక బలగాలతో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం దొరికిన ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మార్గాల్లో 50కి పైగా సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ సమయంలోనే హత్య స్థలానికి సమీపంలో ఓ టెంపో కదులుతున్నట్లు గుర్తించారు. అయితే, చీకటి కారణంగా దాని రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించలేదు. దీంతో దర్యాప్తు అధికారులు మరికొన్ని సీసీటీవీ లొకేషన్ల ఆధారంగా ఆ టెంపో కదలికలను దాదాపు 5 రోజుల పాటు నిమిషం నిమిషానికి ట్రాక్ చేశారు.

నిందితుల్లో ముగ్గురు మైనర్లు.. ఆయుధాల స్వాధీనం

ఈ నెల 15, 16 తేదీల రాత్రి సమయంలో సుదీర్ఘ సెర్చ్ ఆపరేషన్ తర్వాత అనుమానిత టెంపోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. దీంతో ఈ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు మైనర్లతో సహా మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడిని ఖద్దా కాలనీకి చెందిన శివమ్ అలియాస్ సుదామ అలియాస్ చుచుగా గుర్తించారు. మిగిలిన ముగ్గురు మైనర్ల వయస్సు 16, 17 ఏళ్లుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేరానికి ఉపయోగించిన రెండు కత్తులు, నిందితులు ధరించిన దుస్తులు, టెంపోను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోరెన్సిక్, టెక్నికల్ సాక్ష్యాధారాలను పరిశీలించేందుకు పోలీసుల తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** మానవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్‌లోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2019లో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో విచారణ ముగిసి సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నేరం రుజువుకావడంతో ఏకంగా 9 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తుది తీర్పును ప్రకటించింది. శిక్ష పడిన 9 మందిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు ఉండటం గమనార్హం.

ఉద్యోగాల ఆశ చూపి.. వ్యభిచారంలోకి కూపంలోకి..

బంగ్లాదేశ్ నుంచి మహిళలను అక్రమంగా భారత్‌కు తరలించిన ఉదంతం 2019లో తీవ్ర కలకలం రేపింది. నగర పరిధిలోని పహాడీ షరీఫ్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించి హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ను అధికారులు బట్టబయలు చేశారు. బాధితురాళ్లకు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించిన నిందితులు, వారిని అక్రమంగా తరలించి బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లుగా ఎన్ఐఏ దర్యాప్తులో స్పష్టమైంది. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ముఠా గుట్టును దర్యాప్తు సంస్థ రట్టు చేసింది. ఈ వ్యవహారంపై 2019లో పోలీసులు తొలిసారిగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ఈ కేసును రీ-రిజిస్టర్ చేసి తమ చేతుల్లోకి తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ అధికారులు ఈ కేసులో ఏ1 నుంచి ఏ12 వరకు మొత్తం 12 మంది నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం తీర్పు..


ఈ కేసులో న్యాయస్థానంలో పూర్తి వాదనలు పూర్తిగా ముగిశాయి. సాక్ష్యాధారాల సమగ్ర పరిశీలన అనంతరం నిందితులపై నేరం రుజువైంది. దీంతో హైదరాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఈ కేసులో తుది తీర్పును వెల్లడించింది. మొత్తం నిందితుల్లో 9 మందికి జీవిత ఖైదును ఖరారు చేస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పును వెలువరించారు.

## 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

మొదటి పేజీ తరువాయి

ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని.. పక్క రాష్ట్రాలు బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడం కోసం లండన్ వెళ్తుంటే ఇక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. టార్గెట్ కేసీఆర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు.. లక్ష కోట్లు సంపాదించామని కాంగ్రెస్ ప్రభుత్వం తమపై అసత్య ఆరోపణలు చేస్తుందన్నారు. "లక్ష కోట్లు కొల్లగొట్టామని రేవంత్ రెడ్డి అంటున్నారు.. రేవంత్‌కు మంచి ఆఫర్ ఇస్తున్నా.. రూ. 1000 కోట్లు ఇచ్చి మా పేరుపై ఉన్న లక్ష కోట్లు ఆస్తులు తీసుకోండి. మిగిలిన 99 వేల కోట్లు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకోసం ఖర్చు చెయ్యండి.. కాళేశ్వరంలో లక్ష కోట్లని ప్రచారం చేసినట్లుగానే ఇప్పుడు విషప్రచారం చేస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** వినాయక చవితి రోజు ప్రతిష్టించిన బొజ్జ గణపయ్య విగ్రహాలను సంబరాలతో సాగనంపుతున్నారు భక్తులు.. అయితే, డీజే వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడం.. వాహనాన్ని సీజ్ చేసిన ఘటనపై స్పందించిన మంత్రి నారా లోకేష్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాహనాలకు అనుమతుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీకి విజ్ఞప్తి చేశారు మంత్రి నారా లోకేష్.. నిమజ్జనానికి డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ తనకు పలువురు సందేశాలు పంపుతున్నారని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో హోంమంత్రి అనిత, డీజీపీ జోక్యం చేసుకుని డీజే వాహనాలకు అవసరమైన అనుమతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లోకేష్ కోరారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి, వేగంగా క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గణేష్ నిమజ్జనం సందర్భంగా ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని లోకేష్ పోలీసు శాఖను కోరారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకునేలా అధికారులు సహకరించాలని ఆయన తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. లోకేష్ తన ఎక్స్ పోస్టులో హోంమంత్రి అనిత, డీజీపీని ట్యాగ్ చేస్తూ ఈ విజ్ఞప్తి చేశారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. డీజే అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి అనుమతులు ఇచ్చేలా పోలీసు శాఖకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.

## 'కల్పిత నాయకుడు' పుస్తకానికి చెక్!

మొదటి పేజీ తరువాయి



అంబేదర్‌పై ఆరోపణలతో ప్రచురితమైన పుస్తకావిష్కరణను నిలిపివేయాలని, రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన జర్నలిస్ట్ ఏ జ్ఞానచంద్రన్‌మౌలి గురువారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పుస్తకాల విక్రయం జరిగితే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికే పుస్తకాల విక్రయం కోసం ఆన్‌లైన్ వేదికలను ఎంచుకున్నారని తెలిపారు. ప్రభు త్వ తరఫు న్యాయవాది వాదనలు కూడా విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

## రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గోవిందరావుపేట తహసీల్దార్!

మొదటి పేజీ తరువాయి




భూమి పౌతి మార్పిడి పనిని పూర్తి చేసేందుకు కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదు నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. సోదాలు, విచారణ పూర్తయిన అనంతరం కేసు నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర ఆధారాలు, తదుపరి చర్యలపై ఏసీబీ అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు అందుబాటులో ఉన్న వివరాలను ఆరోపణలుగా మాత్రమే పరిగణించాల్సి ఉంటుంది.

## ఫ్యూచర్ సిటీ.. డేటా దూకుడు!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు వరుస కడుతున్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) శంకుస్థాపనతో మొదలై టీసీఎస్ హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్, ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ ప్రాజెక్టులు చేరడంతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్లస్టర్లలో ఒకటిగా ఫ్యూచర్ సిటీ అవతరిస్తున్నది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్, టీసీఎస్ హైపర్వాల్ట్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చూస్తున్న ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు హైదరాబాద్ వైపు మొగ్గు చూస్తున్నాయి. అంతర్జాతీయ డేటా, ఏఐ కంపెనీలు తమ ప్రాసెసింగ్ అవసరాల కోసం హైదరాబాద్ వైపే చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాలకు ఫ్యూచర్ సిటీ కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది. తాజాగా ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) డేటా సెంటర్ కోసం ఫ్యూచర్ సిటీలో పది ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో హైపర్‌స్కేల్ క్లౌడ్ సంస్థలతో పాటు బ్యాంకింగ్ రంగం కూడా రానుంది. ఎస్‌బీఐ డేటా సెంటర్ కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

రూ.60వేల కోట్లతో అమెజాన్ పెట్టుబడి

2025 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అమెజాన్‌తో కుదిరిన ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ప్రకారం రూ.60 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ అభివృద్ధికి సిద్ధపడింది. ఈ ఏడాది జూలై 15న సీఎం రేవంత్‌రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం కేటాయించిన 202 ఎకరాల్లో అమెజాన్ ఫ్లాగ్‌షిప్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులకు ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి వివరిస్తూ అమెజాన్ 60 వేల కోట్ల పెట్టుబడిని లక్ష కోట్లకు పెంచాలని ఆహ్వానించారు. అమెజాన్ డేటా సెంటర్ ప్రాజెక్టు ఫ్యూచర్ సిటీలో యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్‌గా నిలుస్తుందని, దీని ద్వారా ఫార్చ్యూన్-500 సంస్థలు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆ సందర్భంగా పేర్కొన్నారు. అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను ప్రభుత్వం చూసుకుంటుందని భరోసానివ్వడంతో అమెజాన్ ప్రతినిధులు వెంటనే ఆ దిశగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కాగా, సెప్టెంబర్ 5న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై ఫ్యూచర్ సిటీలో రూ.70 వేల కోట్లు పెట్టుబడితో 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటా సెంటర్ 2028 జూన్ 2 నాటికి, తెలంగాణ అవతరణ దినోత్సవానికి ప్రారంభించాలని సీఎం కోరారు. ఈ పెట్టుబడి టీసీఎస్ వైపు నుంచి ఇప్పటివరకు భారత్‌లో ప్రకటించిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి కావడం గమనార్హం. తాజాగా ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ సంస్థ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో సుమారు 170 ఎకరాల్లో హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రారంభ పెట్టుబడి రూ.60 వేల కోట్లు కాగా తర్వాతి దశల్లో మొత్తం పెట్టుబడి రూ.లక్ష కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఫ్యూచర్ సిటీలో కంట్రోల్ ఎస్ సంస్థకు సంబంచించిన భారీ 2 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ ఇప్పటికే నిర్మాణానికి నోచుకుంది. యూపీసీ వోల్ట్ సంస్థకు సంబంచించిన 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనపై సైతం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫ్యూచర్ సిటీలో జీసీసీలకు మార్గం సుగమం

హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రధాన జీసీసీ కేంద్రంగా దూసుకెళ్తున్నది. ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ద్వారా భారీ కంప్యూట్ మౌలిక సదుపాయాలు ఏర్పడితే, కొత్త జీసీసీలు, ఏఐ యూనిట్లు ఇక్కడికి రావడం సహజ పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు ఫ్యూచర్ సిటీ వైపు మరింత దృష్టి సారించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, జీసీసీల కోసం ఒక ప్రత్యేకమైన జోన్ వంటి ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా విడుదల చేసే భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌తో దీనిపై మరింత క్లారిటీ రానుంది.

# పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ చేయూత

- 500 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పలకల పంపిణీ
- విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి: గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు
- పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయం-- శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్



**తెలుగు గళం, ఏటూరునాగారం, సెప్టెంబర్ 18:**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఆకులవారి ఘనపురం, ఏటూరునాగారం రామాలయం, చిన్నబోయినపల్లి, శంకరాజుపల్లి, ముల్లకట్ట, ఇప్పలగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 500 మంది పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాన్ని శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు మురళీకృష్ణ రెడ్డి, కల ప్రసాద్, ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, లక్ష్మణరావు, ఆదిశివ, సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

**తెలుగు గళం న్యూస్**
**పాలకుర్తి సెప్టెంబర్ 18**



పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా శ్రీ సోమేశ్వర విఘ్నేశ్వర స్వామి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో ఉత్సవ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా మారింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

# సత్తుపల్లి జర్నలిస్టు ప్రతిభకు తగ్గ గౌరవం

## శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా పోతర్లంక జయరామ్ నియామకం --జయరామ్ కి అక్షర కిరీటీ అవార్డు ప్రదానం



**సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్18(తెలుగు గళం) న్యూస్:**

సత్తుపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ కవి, ఈమాట పత్రిక విలేకరి పోతర్లంక జయరామ్ శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు, ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షులు ఈశ్వరి భూషణం, అధికార ప్రతినిధి వరలక్ష్మి సాయిరాం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు

సాహితీ రంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ నియామకం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు , ఇదే వేదికపై జయరామ్‌కు అక్షర కిరీటీ అవార్డును కూడా ప్రకటించారు. సెప్టెంబర్ 20 ఆదివారం రోజున భద్రాచలం పౌల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ఎట్టపాక లో జరగనున్న కార్యక్రమంలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకుంటారు . ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక 176వ శతాధిక కవి సమ్మేళనంలో ఈ అవార్డు ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు, కవులు, కళాకారులను శ్రీశ్రీ కళావేదిక ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, దేశ విదేశాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. కవిగా తనను గుర్తించినందుకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శిగా నియామకం పొందడంతో పాటు అక్షర కిరీటీ అవార్డుకు ఎంపికైన జయరామ్‌కు సత్తుపల్లి డివిజన్ కవులు, రచయితలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం.. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ

## సర్వం కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి: జిల్లా ఆత్మ కమిటి చైర్మన్ చిటమట రఘు

## బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి





**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 18:**

ఏటూరునాగారం మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్ ఐటీఐ వెనుక నివాసం ఉంటున్న ఇర్పా సుజాత--నరేష్ కుటుంబానికి చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమై కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటన వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తహసీల్దార్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించి, తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తరపున కూడా బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చిటమట రఘు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, కూరపాటి వేణు, గండపెల్లి సత్యం, వార్డు నెంబర్ ముమ్మనేని రమేష్, గండపెల్లి మహాలక్ష్మి, గండపెల్లి రజిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

## : ఏధిర పీహెచ్‌సీలో పీవో లెనిన్ వత్సల్ టొప్పో ఆకస్మిక తనిఖీ

## వైద్య సిబ్బంది హాజరుపై ప్రత్యేక నిఘా.. మందులు, వ్యాక్సిన్ల నిల్వలపై పీవో ఆరా

## ఏజెన్సీ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

## గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశం





**తెలుగు గళం వెంకటాపురం - ఏధిర సెప్టెంబర్ 18:**

ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఐఏఎస్ శుక్రవారం వెంకటపురం మండలం ఏధిరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందులు, వ్యాక్సిన్ల నిల్వలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, మంజూరైన పోస్టులు, ఖాళీలు, విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. కోల్డ్‌స్టోరేజ్‌లోని వ్యాక్సిన్లు, ఇంజెక్షన్లను పరిశీలించి నిరంతర విద్యుత్ సరఫరాపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్ స్టోర్‌ను తనిఖీ చేసి మందుల నిల్వ, తయారీ, గడువు తేదీలను పరిశీలించారు. మందుల స్వీకరణ, పంపిణీకి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు, పాముకాటు, కుక్కకాటు తదితర అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లను తగినంతగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన పీవో.. ఏజెన్సీ గ్రామాల్లో తరచుగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలని ఆదేశించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, పెన్షన్లు, నిత్యావసర సరఫరా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళల్లో సిబ్బంది లభ్యత, వసతి సౌకర్యాలపై కూడా ఆరా తీసిన పీవో, అవసరమైన అంశాలపై డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారితో సమన్వయం చేసుకోవాలని వైద్యాధికారికి సూచించారు. అత్యవసర రోగుల తరలింపునకు 108, బైక్ అంబులెన్స్ సేవల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా తగిన సమన్వయం ఉండాలని సూచించారు.

# తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువల ఆహారం తీసుకోవాలి”







**సత్తుపల్లి/కల్లూరు, సెప్టెంబర్ 18 (తెలుగుగళం):** తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంటి వద్దే తయారు చేసుకుని గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల జ్యోతి సూచించారు. కల్లూరు మండలం రఘునాథగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో సెక్టార్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు అందించే ఇంటికి తీసుకెళ్లే పోషకాహార పదార్థాలతో అంగన్వాడీ టీచర్లు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. పోషకాహారం ప్రాముఖ్యత, తయారీ విధానం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్య శాఖ అందించే మందులు, పోషకాహారాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సీడీపీఓ సూచించారు. అనంతరం గర్భిణీలకు సాంప్రదాయ పద్ధతిలో చీర, సారె, పూలు, పండ్లు, గాజులు, సలిమిడితో ఒడినింపి సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో సూపర్వైజర్ సుజాత, సర్పంచ్ సుధారాణి, ఉప సర్పంచ్ కోటేశ్వరి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు రానా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు రేవతి, పద్మ, ప్రియాంక, మంగమణి, యశోద, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో జ్ఞాన సరస్వతీ విగ్రహావిష్కరణ”



**సత్తుపల్లి/సెప్టెంబర్ 18 (తెలుగుగళం) న్యూస్:** వాసవి జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ జన్మదినం, అధికార పర్యటన సందర్భంగా రీజియన్-4 పరిధిలోని సత్తుపల్లి మండలం వాసవి క్లబ్ బుగ్గపాడు కపుల్స్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మొండివర్రే కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జ్ఞాన సరస్వతీ విగ్రహాన్ని శు క్రవారం ఆవిష్కరించారు. కీశే పోకూరి వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు దూబగుంట్ల శ్రావణి మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు త్వరలో ఎల్‌ఈడీ టీవీ అందిస్తామని తెలిపారు. గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా సరస్వతీ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కల్పించిన క్లబ్ సభ్యులకు, విగ్రహం ఏర్పాటు చేసిన పోకూరి కృష్ణ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు టీవీ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా క్లబ్ ద్వారా అన్నప్రసాదానికి రూ.3 వేల విరాళం అందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో: క్లబ్ కార్యదర్శి రాజేష్ ఖన్నా, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మల్టిపుల్ పోలిశెట్టి శ్రీశివకుమార్, రీజియన్ చైర్మన్ పోకూరి కృష్ణ ప్రసాద్, జోన్ చైర్మన్ దూబగుంట్ల వీర రాఘవులు, సర్పంచ్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, లింగాలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి ప్రసాద్, క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామన్నపాలెం లో పోషకాహారాల ప్రదర్శన”





సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్ 18 (తెలుగుగళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల రామన్నపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం ఆధ్వర్యంలో శుక్రవారం పోషణా మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి వరప్రసాద్, ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పోషకాహార పదార్థాలతో ఆహార ప్రదర్శన నిర్వహించి తల్లులకు పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో: ఏఎన్ఎం శ్రీలక్ష్మి,అంగన్‌వాడీ ఉపాధ్యాయులు మంగమ్మ, లలిత, తల్లులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గుడిసెలోనే ప్రభుత్వ పాఠశాల.. రెండుగదుల భవనానికి నటుడు సంజోష్ హామీ

## కలెక్టర్ అనుమతి ఇస్తే మోట్లగూడెంలో పాఠశాల భవనం నిర్మిస్తా

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా ఉంటా!



**తెలుగు గళం వెంకటాపురం సెప్టెంబర్ 18:**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం మోట్లగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను గుడిసెలో నిర్వహిస్తున్న పరిస్థితిని తెలుసుకున్న నటుడు సంజోష్ స్పందించారు. పాఠశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందన లేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు గదుల పాఠశాల భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకుంటానని తెలిపారు. కలెక్టర్ అనుమతి లభిస్తే మోట్లగూడెంలో రెండు గదుల పాఠశాల భవనం నిర్మిస్తానని గ్రామస్తులు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంజోష్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. “ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎప్పుడూ అండగా ఉంటాను” అని నటుడు సంజోష్ తెలిపారు.

# హసన్‌పర్తిలో రెండు రోడ్డు ప్రమాదాలు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**తెలుగు గళం న్యూస్ హసన్‌పర్తి సెప్టెంబర్ 18**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి హసన్‌పర్తి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.గత నెల 22న సాయంత్రం ఎల్లాపూర్‌కు చెందిన పొగాకు సాయినాథ్ (24) తన తమ్ముడు సన్నీ (16)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్లాపూర్ నుంచి హసన్‌పర్తి వైపు వెళ్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదం జరిగింది. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న టాటా గూడ్స్ క్యారేజ్ వాహనం వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి పెట్రోల్ బంక్ వద్ద ఒక్కసారిగా కుడివైపునకు మళ్లి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సాయినాథ్‌కు తల ఎడమవైపు, ఎడమ కన్ను, ఎడమ చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అనంతరం గార్డియన్ ఆసుపత్రి, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.ప్రమాదం కారణంగా ఆయన ఎడమ కంటి చూపును కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు.విచారణలో ప్రమాదానికి కారణమైన వాహనం నంబర్ టిజీ-02-టి-4640గా, డ్రైవర్ గుఫ్రాన్‌గా గుర్తించారు. సాయినాథ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరో ఘటనలో ఈ నెల 15న రాత్రి అంబాల రోడ్డు, గ్రీన్‌వుడ్ పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.కమలాపూర్ మండలం నెరెళ్ల గ్రామానికి చెందిన వ్యాపారి ఉప్పుల ఓం ప్రకాష్ (53) తన కుమారుడిని రైలెక్కించేందుకు వరంగల్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా రాత్రి 9.50 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వేగంగా ఢీకొనడంతో ఓం ప్రకాష్ తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు.స్థానికులు, అంబులెన్స్ సాయంతో మొదట ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అనంతరం శరణ్య ఆసుపత్రికి, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు.ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను ఎర్రగట్టుగుట్టకు చెందిన ఆకుల సందీప్‌గా పోలీసులు గుర్తించారు.బాధితుడి సోదరుడు ఉప్పుల శివప్రసాద్ ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిన్నారులకు అక్షరాభ్యాసాలు"

**• గర్భిణీలకు శ్రీమంతాలు" • భీమవరంలో పోషణ మాసం కార్యక్రమం"**









సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్ 18 (తెలుగుగళం) న్యూస్ : నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలోని భీమవరం గ్రామపంచాయతీ పరిధిలోని భీమవరం-1 అంగన్వాడీ కేంద్రంలో వేంసూరు సెక్టార్ సూపర్ వైజర్ కమల ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వంట్లా రమేష్ పాల్గొని ప్రసంగించారు. తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్వాడీ టీచర్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో బి. సత్యవతి మాట్లాడుతూ ఆహార పదార్థాల్లోని పోషక విలువలు కోల్పోకుండా వంట చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వివరించారు. అనంతరం ఇద్దరు గర్భిణులకు సీమంతం నిర్వహించి తగిన జాగ్రత్తలను సూచించారు. ఆరుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో: ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఆరోగ్య కార్యకర్త నసీమా, అంగన్వాడీ ఉపాధ్యాయులు శాంతకుమారి, రాధాకుమారి, రజిని, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.

# అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ సీజ్

## ఇద్దరిపై కేసు నమోదు..డ్రైవర్ అదుపులోకి

**తెలుగు గళం న్యూస్ హసన్‌పర్తి, సెప్టెంబర్ 18**

ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ (మట్టి) తరలిస్తున్న టిప్పర్ లారీని హసన్‌పర్తి పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి టిప్పర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆర్. మల్లికార్జున్ (ఎఎస్సై-2139) సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో సాయంత్రం 5:15 గంటల సమయంలో నల్లగుట్ట వై-జంక్షన్ వద్ద గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ లారీని అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. వాహన డ్రైవర్‌ను విచారించగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా లదేల్ల గ్రామం నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు వెల్లడైంది. పోలీసులు టిప్పర్ డ్రైవర్ జంగిలి శ్రీను (39), స్వామి కుమారుడు, చెన్నారావుపేట మండలం, గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్ యజమాని పెండ్యాల భిక్షపతి (48), ఐలయ్య కుమారుడు, 'ఓ' సిటీ, వరంగల్‌కు చెందిన వ్యాపారిగా పోలీసులు గుర్తించారు. గ్రావెల్ లోడ్‌తో ఉన్న ఎపి-39-టిఎన్-8388 నంబర్ గల టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో మధ్యవర్తుల సమక్షంలో కన్ఫెషన్, సీజ్ పంచనామా నిర్వహించిన అనంతరం వాహనాన్ని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్, గ్రావెల్ తరలింపు వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు.

# "వసూలు మాత్రం ముక్కుపిండి.. సదుపాయాలంటే మొహం చాటేసి!"

**పదేళ్లుగా పైకప్పు లేక ఎండా.. వానలో వాహనదారుల అవస్థలు**

**నిబంధనల ప్రకారం సదుపాయాలు కల్పించని జీసీసీ బంక్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి**

**తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 17:**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రోహీర్‌లోని జీసీసీ పెట్రోల్ బంక్ (ధనలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్)లో వినియోగదారులకు కనీస సదుపాయాలు అందుబాటులో లేకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా పెట్రోల్ బంక్ వద్ద ఎండ, వాన నుంచి రక్షణ కల్పించే పైకప్పు లేకపోవడంతో ఇంధనం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్రోల్ బంక్‌లలో వినియోగదారులకు అందించాల్సిన ప్రాథమిక సదుపాయాల్లో ఉచిత గాలి, నీరు, ఫిర్యాదు పుస్తకం, ప్రథమ చికిత్స పెట్టె, మరుగుదొడ్డి, అవసరమైన భద్రతా పరికరాలు వంటి అంశాలు ఉన్నాయని చమురు సంస్థల వినియోగదారుల మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. గాలి సదుపాయం వంటి సేవలను అందించకపోవడం కూడా సంబంధిత మార్కెటింగ్ మార్గదర్శకాల్లో ఉల్లంఘనగా పేర్కొనబడింది. అయితే రోహీర్ జీసీసీ పెట్రోల్ బంక్‌లో టైర్లకు గాలి నింపే మిషన్ పనిచేయకపోవడం, వినియోగదారులు అత్యవసర సమయంలో గాలి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పదేళ్లుగా పైకప్పు లేకపోవడం కూడా బంక్‌లో వినియోగదారుల సౌకర్యాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఇంధన ధరలు పూర్తిగా వసూలు చేస్తున్నప్పుడు, వారికి నిబంధనల ప్రకారం అందాల్సిన ప్రాథమిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యతను యాజమాన్యం విస్మరించకూడదని వాహనదారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతంలోని పెట్రోల్ బంక్‌లో భద్రత, సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత చమురు సంస్థ ఉన్నతాధికారులు, పౌరసరఫరాలు, తూనికలు--కొలతలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు వెంటనే పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేయాలని వాహనదారులు డిమాండ్ చేశారు. బంక్‌లో అందుబాటులో ఉండాల్సిన సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ రికార్డులు, వినియోగదారుల ఫిర్యాదుల వ్యవస్థ తదితర అంశాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే యాజమాన్యంపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.




అలాగే పనిచేయని గాలి మిషన్‌ను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు, వినియోగదారులకు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని, పదేళ్లుగా కొనసాగుతున్న పైకప్పు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అధికారులు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, లోపాలను సరిచేసే వరకు పర్యవేక్షణ కొనసాగించాలని వాహనదారులు కోరుతున్నారు

# అథ్లెటిక్స్‌లో ములుగు జిల్లాకు రెండు పతకాలు

**దక్షిణ భారత జోనల్ పోటీల్లో బాచి స్వర్ణం.. చరణ్ రజతం**

**విద్యార్థుల ప్రతిభపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ హర్షం**

**తెలుగు గళం ములుగు, సెప్టెంబర్ 18:**





పుదుచ్చేరిలో నిర్వహించిన దక్షిణ భారత జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ములుగు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో ములుగు జిల్లా విద్యార్థులు సత్తా చాటడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా బందారుపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి బాచి 1000 మీటర్ల మిడ్లీ రిలే విభాగంలో పాల్గొని స్వర్ణ పతకం సాధించాడు. పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ జట్టు విజయానికి కీలకంగా నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. అదేవిధంగా బందారుపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి చరణ్ కిడ్స్ జావెలిన్ త్రోలో 14 ఏళ్ల విభాగంలో పాల్గొని రజత పతకం సాధించాడు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీలకు సమానమైన జోనల్ స్థాయి వేదికపై ప్రతిభ చూపడం విశేషమని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. ఇద్దరు విద్యార్థులు సాధించిన విజయాలు ములుగు జిల్లాలోని పాఠశాలలు, గురుకుల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరు రెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే మెరుగైన క్రీడా శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ భారత జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన బాచి, చరణ్‌లను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని ములుగు జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సైనికుల కుటుంబానికి న్యాయం కోసం

# ఆర్టీఐ పరిరక్షణ కమిటీ అండ

**ఇంటి నంబర్ మార్పుపై అధికారిక రికార్డుల వెలికితీతకు మూడు జిల్లాల కమిటీల చర్యలు**


సమాచార హక్కు చట్టం, 2005 కింద దరఖాస్తు
సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోరుతూ
కు
ప్రజా సమాచార అధికారి (PIO) గారు,
జిల్లా కలెక్టర్ కార్యాలయం,
జనగాం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పిన్‌కోడ్: 506167
విషయం:
జిట్టబోయిన వెంకటయ్య గారి ఇంటి నంబర్ 4/15 నుండి 4/15/2గా జరిగిన నమోదు/మార్పు, ప్రస్తుతం 4/15/2 ఏ వ్యక్తి పేరు మీద ఉన్నది, ఆస్తి హద్దులు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్, సంబంధిత దరఖాస్తులు, అనుమతులు, అధికారిక ఆదేశాలు/పత్రాలు, గత ఐదు సంవత్సరాల నిధులు-బిల్లులు మరియు సంబంధిత రికార్డుల ప్రత్యక్ష తనిఖీకి తేదీ కేటాయింపు గురించి సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 6(1) కింద సమాచారం కోరుతూ.
మహోదయులకు,
ప్రజా ప్రయోజనం మరియు ప్రభుత్వ రికార్డుల్లో పారదర్శకతను నిర్ధారించుకునే ఉద్దేశంతో సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 6(1), 2(f), 2(j) ప్రకారం క్రింది సమాచారాన్ని సంబంధిత అధికారిక రికార్డుల ఆధారంగా అందించగలరు.
కోరుతున్న సమాచారం
1. జిట్టబోయిన వెంకటయ్య గారి పేరుతో గతంలో ఉన్న ఇంటి నంబర్ 4/15 మొదట ఏ తేదీన, ఏ సంవత్సరంలో గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదు చేయబడిందో తెలియజేసి, సంబంధిత House Register/Assessment Register పేజీల ధృవీకరించిన జిరాక్స్ ప్రతులు ఇవ్వాలి.
2. అందుబాటులో ఉన్న పత్రాలలో కనిపిస్తున్న 15-06-1999 తేదీకి సంబంధించిన రికార్డు ఏదో గుర్తించి, ఆ రికార్డులో నమోదైన పూర్తి వివరాలు మరియు ధృవీకరించిన జిరాక్స్ ప్రతిని ఇవ్వాలి.
ఇంటి నంబర్ 4/15 నుండి 4/15/2గా ఎప్పుడు, ఏ తేదీన, ఏ సంవత్సరంలో మార్చబడిందో, ఆ మార్పుకు ...ర్డులో పేర్కొన్న కారణం ఏమిటో తెలియజేయాలి.
...15 నుండి 4/15/2గా మార్చడానికి ఎవరి నుండి దరఖాస్తు స్వీకరించారో, ఆ దరఖాస్తు మరియు దానికి ...సిన పత్రాల ధృవీకరించిన జిరాక్స్ ప్రతులు ఇవ్వాలి.
...టి నంబర్ మార్పుకు సంబంధించి నిర్వహించిన విచారణ నివేదిక, పంచాయతీ తీర్మానం, పంచాయతీ ... సర్పంచ్ సిఫారసు/అనుమతి, సంబంధిత అధికారి ఉత్తర్వు, ప్రొసీడింగ్స్ మరియు ఫైల్ నోటింగుల ...చిన జిరాక్స్ ప్రతులు ఇవ్వాలి.
...ంటి నంబర్ 4/15/2 ఏ వ్యక్తి పేరు మీద నమోదై ఉందో ఆ వ్యక్తి పూర్తి పేరు మరియు అధికారి...

**జనగామ, సెప్టెంబర్ 18 (తెలుగు గళం న్యూస్)**

దేశ సరిహద్దుల్లో సైనికులుగా సేవలందిస్తున్న ఇద్దరు కుమారుల రైతు కుటుంబం ఎదుర్కొంటున్న ఇంటి నంబర్ సమస్యపై న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి సమాచార హక్కు పరిరక్షణ కమిటీ అండగా నిలిచింది. అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, సమస్య పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాల్లో సహకరిస్తామని జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ కాసోజు తెలిపారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న రైతు కుటుంబానికి చెందిన చిన్న కుమారుడు ఫోన్ ద్వారా జనగామ జిల్లా ఆర్టీఐ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామిని సంప్రదించి కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యను వివరించినట్లు తెలిపారు. బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్న కారణంగా కుటుంబ సమస్యపై అధికారులను స్వయంగా కలవడం కష్టంగా ఉందని, కుటుంబానికి ఇబ్బందులు, నష్టం జరుగుతున్న నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా సహకరించాలని సైనికుడు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన కమిటీ ప్రతినిధులు సమస్యను పూర్తిగా పరిశీలించి, అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నంబర్‌కు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. మొదట 4-15 ఇంటి నంబర్ ఎవరికి కేటాయించారు? ఏ సంవత్సరంలో కేటాయించారు? 1990 నుంచి ఇప్పటి వరకు ఇంటి పన్ను ఎవరి పేరుతో నమోదైంది? ఎవరు పన్ను చెల్లించారు? పాత రికార్డుల్లో ఏమైనా మార్పులు జరిగాయా? ప్రస్తుతం 4-15/1, 4-15/2గా ఇంటి నంబర్ మార్చడానికి కారణం ఏమిటి? అనే అంశాలపై అధికారిక సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటి నంబర్ మార్పు కోసం ఎవరు దరఖాస్తు చేశారు, దరఖాస్తు తేదీ ఏమిటి, దానిని పరిశీలించిన అధికారి ఎవరు, మార్పునకు ఆధారమైన ఉత్తర్వులు, అనుమతులు ఏమిటి, పాత--కొత్త రికార్డుల్లో యజమాని పేర్లు ఎలా నమోదయ్యాయి తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై సమాచార హక్కు చట్టం--2005 కింద జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీఐ దరఖాస్తు సమర్పించి, ఇంటి నంబర్‌కు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులు, ఇంటి నంబర్ మార్పుకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతులు, ఉత్తర్వులు, పన్ను రికార్డులు తదితర అధికారిక వివరాలను సేకరించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల కుటుంబానికి అవసరమైన సహకారం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జావిద్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కాట కుమారస్వామి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ కాసోజు తెలిపారు. రైతు కుటుంబానికి అన్యాయం జరిగిందా లేదా అనే విషయం అధికారిక రికార్డుల పరిశీలనతోనే స్పష్టమవుతుందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు సమాచార హక్కు చట్టం, ఇతర చట్టబద్ధమైన మార్గాల్లో అవసరమైన సహకారం అందిస్తామని, సైనికుల కుటుంబం న్యాయం కోసం ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేదని వారు స్పష్టం చేశారు.


సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జనగామ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జావీద్


సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షులు కాటా కుమారస్వామి


సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీధర్ కాసోజు

# జీలుగుమిల్లిలో వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



తెలుగు గళం: జీలుగుమిల్లి మండల కేంద్రంలోని గ్రేస్ మందిర్ ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం మమతా హాస్పిటల్ వైద్య బృందం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, అలాగే శ్రీ సూర్య బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలకు తగిన సూచనలు మరియు మందులు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం ఎంతో గొప్ప సేవ అని అన్నారు. యువత రక్తదాన కార్యక్రమాల్లో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా సంస్థలు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బి. ఎజ్రా శాస్త్రి, గ్రేస్ మందిర్ యూత్ సభ్యులు, కూటమి నాయకులు పద్దం వెంకటకృష్ణ, నెలటూరి మోహన్,, డాక్టర్ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.